సాక్షి అన్నమయ్య జిల్లా

గురువారం । 9 । జనవరి । 2025



రేషన్ బియ్యం పట్టివేత

జిల్లా కేంద్రం రాయచోటిలోని ఓ రైస్ మిల్లులో తరలింపునకు సిద్ధంగా ఉన్న 350 క్వింటాళ్ల (700 బస్తాలు) పీడీఎఫ్ బియ్యాన్ని స్పెషల్ పార్టీ పోలీసులు గుర్తించారు. - 8లో



డ్రిప్ ఇరిగేషన్‌కు రూ.450 కోట్లు మంజూరు

రాష్ట్రంలో డ్రిప్ ఇరిగేషన్ కోసం రూ.450 కోట్లు మంజూరు చేశామని ఉద్యానవన, పట్టు పరిశ్రమల శాఖ రాష్ట్ర డైరెక్టర్ శ్రీనివాసులు అన్నారు. - 8లో



భళీరా.. బసవా !

సంక్రాంతి వచ్చిందంటే గంగిరెద్దుల వాళ్లకి మూడు నెలలు పండుగే. గజ్జెలు కట్టి రంగు రంగుల వస్త్రాలతో బసవన్నలను అలంకరించి ఊరూరా తిరుగుతూ సందడి చేస్తారు. - 8లో

న్యూస్‌రీల్

యువజనోత్సవాలకు ఎంపిక

రాయచోటి (జగదాంబసెంటర్) : ఈ నెల 11, 12వ తేదీల్లో న్యూఢిల్లీలో జరిగే జాతీయ యువజనోత్సవాలకు ఆంధ్రప్రదేశ్ తరఫున అన్నమయ్య జిల్లా మదనపల్లె జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల విద్యార్థినులు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని జిల్లా స్టెప్ ముఖ్య కార్యనిర్వహణాధికారి సి.సాయిగ్రేస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. యువజన సర్వీసుల శాఖ, స్టెప్ ఆధ్వర్యంలో 2024 నవంబర్ 29న జరిగిన జిల్లా యువజనోత్సవాల్లో జానపద నృత్యం అయిన బంజారా నృత్యంలో వీరు రాణించారన్నారు.

వార్షిక బ్రహ్మోత్సవాల నిర్వహణకు టెండర్లు

రాయచోటి టౌన్ : రాయచోటిలోని శ్రీ భద్రకాళి సమేత వీరభద్రస్వామి దేవస్థానంలో ఫిబ్రవరి 23 నుంచి మార్చి 5 వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా దేవస్థానంలో వివిధ పనులు చేయడానికి ఈ నెల 31న ఆలయంలో టెండర్లు నిర్వహిస్తున్నట్లు ఈవో డీవీ రమణారెడ్డి బుధవారం తెలిపారు. గురువారం సాయంత్రం 4గంటల లోపు సీల్డు టెండర్ బాక్స్‌లో వేయాలని చెప్పారు. హిందువులు మాత్రమే పాల్గొనాలని, వీరికి దురలవాట్లు ఉండరాదన్నారు. పాన్, ఆధార్‌కార్డు సీల్డు కొటేషన్‌కు జతపరిచాలన్నారు. టెండరు ఓపెన్ చేశాక అన్యమతస్తులు ఎవరైనా సీల్డు కొటేషన్స్ వేసి ఉంటే తిరస్కరించనున్నట్లు తెలియజేశారు.

11న హాకీ జట్టు ఎంపిక

మదనపల్లె : అన్నమయ్యజిల్లా హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని బీటీ కళాశాల హాకీ గ్రౌండ్స్‌లో ఈనెల 11వ తేదీ జిల్లాస్థాయి సబ్ జూనియర్ బాలుర హాకీ టీమ్ ఎంపిక జరుగుతుందని ప్రెసిడెంట్ పీ.వి.ప్రసాద్, సెక్రటరీ బి.శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ జూనియర్ బాలుర హాకీ టీమ్ ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు జనవరి 1, 2009 తర్వాత పుట్టి ఉండాలన్నారు. వివరాలకు 9494743425, 9441152481 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

తప్పుడు క్లెయిమ్‌లతో భవిష్యత్తులో చిక్కులు



మాట్లాడుతున్న వంశీధర్

మదనపల్లె : తప్పుడు క్లెయిమ్‌లతో ఆదాయపు పన్ను రీఫండ్ పొందితే భవిష్యత్తులో చిక్కులు తప్పవని తిరుపతి రేంజ్ ఆదాయపు పన్ను శాఖ అడిషనల్ కమిషనర్ టీవీ.వంశీధర్ అన్నారు. పట్టణంలోని రోటరీక్లబ్ సమావేశ భవనంలో బుధవారం అవుట్ రీచ్ ప్రోగ్రాం నిర్వహించారు. ఐటీ అడిషనల్ కమిషనర్ వంశీధర్ మాట్లాడుతూ నాగరికతకు పెట్టే ఖర్చు పన్ను అని, చెల్లించే మొత్తాల నుంచే ప్రభుత్వం ప్రజావసరాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ఖర్చు చేస్తుందని పేర్కొన్నారు. పన్ను బాధ్యతగా చెల్లించినప్పుడే సమాజం, దేశం అభివృద్ధి చెందుతుందని, చాలామంది తప్పుడు క్లెయిమ్‌లు సమర్పించారన్నారు. టీడీఎస్ మొత్తాన్ని రీఫండ్ రూపంలో తీసేసుకుంటున్నారని, చెల్లించిన మొత్తాన్ని రీఫండ్ ఇస్తామని చెప్పే దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. మదనపల్లెలో ఇలాగే ఓ వ్యక్తి కోట్ల రూపాయల కుంభకోణానికి పాల్పడి జైలుకెళ్లి విచారణ ఎదుర్కొంటున్నారన్నారు. మదనపల్లె ఆదాయపుపన్ను శాఖ అధికారి టి.మహమ్మద్ ఫారుఖ్, ఇన్స్‌పెక్టర్ సూర్యబాబునాయక్, టాక్స్ బార్ అసోసియేషన్ సభ్యులు ప్రసాద్, చైతన్య, హరికృష్ణ, దిలావర్ అలీ, ఎస్‌పి.మస్తాన్, సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

కరువుకు ప్రత్యామ్నాయం చూపలేరా!

- ఇప్పుడైనా రైతుల మేలు కోరండి
- మీరు చెప్పే లేటెస్ట్ వెరైటీలు నా చిన్నప్పటివి
- రాళ్ల సీమను మార్చాల్సింది మీరేకదా
- జిల్లా అధికారులపై కేంద్ర కరువు బృందం లీడర్ పెరిన్‌దేవి ప్రశ్నల వర్షం



బి.కొత్తకోట మండలం తుమ్మనంగుట్టలో కరువు బృందానికి పంట నష్టం వివరిస్తున్న మహిళా రైతు రామలక్ష్మమ్మ

బి.కొత్తకోట : కరువు ఉందని మీరు చూపిస్తారు..కరువుకు ప్రత్యామ్నాయం చూపలేరా, ఐదేళ్ల కిందట కేంద్ర ప్రభుత్వం ఆయిల్‌సీడ్ మిషన్ అమలు చేస్తోంది తెలుసా అని కేంద్ర కరువు బృందానికి నాయకత్వం వహించిన కేంద్రప్రభుత్వ విధానాలు, కోఆర్డినేషన్స్ విభాగం సంయుక్త కార్యదర్శి పెరిన్‌దేవి జిల్లా అధికారులను ప్రశ్నించారు. బుధవారం బి.కొత్తకోట మండలం తుమ్మనంగుట్ట రైతుభరోసా కేంద్రంలో జిల్లా కరువు పరిస్థితులపై అధికారులు ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శన, రైతుల ముఖాముఖి కార్యక్రమంలో బృందం పాల్గొంది. ఈ సందర్భంగా ఫోటో ప్రదర్శన తిలకించిన టీమ్‌లీడర్ పెరిన్‌దేవి వ్యవసాయశాఖ అనుసరిస్తున్న విధానాలపై తీవ్రంగా స్పందించారు.

రైతును మేల్కొల్పండి

సంప్రదాయ వేరుశనగలో కొత్త విత్తనాలను రైతులకు పరిచయం చేయడం లేదా అని జిల్లా వ్యవసాయాధికారి చంద్రనాయక్‌ను పెరిన్‌దేవి ప్రశ్నించారు. రైతులకు 812, కదిరి, లేపాక్షి , నారాయణి రకం విత్తనాలు అందిస్తున్నామని చంద్రానాయక్ చెప్పగా ఆమె అసహనానికి గురయ్యారు. మీరు చెబుతున్న వెరైటీ నా చిన్నప్పటివి, ఇప్పుడు 2,400 రకాల విత్తనాలు ఉన్నాయి. మీరింకా పాత వెరైటీలనే అనుసరిస్తున్నారు. కొత్త విత్తనాలతో కరువును తట్టుకుని అధిక దిగుబడి ఇచ్చే విత్తనాలను ఎందుకు రైతాంగానికి అందివ్వడం లేదని ప్రశ్నించారు.కరువును ఎలాగు ఆపలేము. కరువును తట్టుకునే పంటల సాగువైపుకు రైతులను తీసుకెళ్లండి..తెలపకపోతే దయచేసి ఇప్పుడైనా చెప్పండి అని కోరారు.

మీప్రణాళిక ఏంటో అర్థంకావడం లేదు

ఉపాధి పథకాలు అమలులో ఏం ప్రణాళికలు చేస్తున్నారో అర్థంకావడం లేదని పెరిన్‌దేవి అన్నారు. ట్రంచ్‌లను మెట్ల మాదిరి తవ్వితే వాటి వల్ల ఎవరికి ఉపయోగం అని డ్వామా పీడీ వెంకటరత్నంను ప్రశ్నించారు. ఇందులో నిల్వ ఉండే నీరు పక్షులకు మాత్రమే ఉపయోగపడుతాయని, పశువులు, జంతులకు తాగేందుకు వీలుండదు కాదా అని ప్రశ్నించారు. జిల్లాకు మరో లక్ష పనిదినాలు కల్పిస్తాం, తద్వారా ఇతర ప్రణాళికలు అమలు చేస్తారా అని అడిగారు. కనీసం నీటి వినియోగం మూగజీవులకు కలిగేలా చూడాలని కోరారు. కాగా..ఎన్నాళ్లని రాయలసీమను రాళ్లసీమ అంటారు. మార్పు మీరే కదా తేవాల్సిందని జలవనరులశాఖ ఎస్ఈ వెంకట్రామయ్యతో పెరిన్‌దేవి అన్నారు. ఆకాశం నుంచి గంగను తీసుకొస్తానంటే భగీరథులు అయిపోతారా అని అంటూ చెరువుల్లో నీటి నిల్వ సామర్థ్యం పెంచాలని, చెక్‌డ్యామ్, కాలువల్లో నీటి నిల్వలకు చర్యలు తీసుకోవాలని సూచించారు. నరేగా నిధులతో పాటు కేంద్ర రాష్ట్ర నిధులు కూడా అందుతాయన్నారు.

కరువు రైతులకు నష్టం జరగకూడదు

ఈ ప్రాంత రైతులకు నష్టం కలగకుండా ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రను పెరిన్‌దేవి కోరారు. మేం వస్తున్నామని తెలిసినా కృషి విజ్ఞాన కేంద్రం వారు రావొద్దా అని ప్రశ్నించారు. కేవీకే ద్వారా రైతులకు ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయని సూచించారు. వ్యవసాయశాఖ జిల్లా అధికారి చంద్రనాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం కరువు రైతులకు ఉలవలు, కందులను రైతులకు సరఫరా చేసిందని చెప్పారు. గత ఖరీఫ్‌లో 75 శాతం పంటలు దెబ్బతిన్నాయని, దీనికి సకాలంలో వర్షాలు కురవకపోవడం కారణమని కరువు బృందం దృష్టికి తెచ్చారు. గత ఏడాది ఎకరాకు 4–5 బస్తాల దిగుబడి వచ్చిందని, గడిచిన ఖరీఫ్‌లో వర్షాభావం వలన దిగుబడి లేదన్నారు.

పంచాయతీ చూసుకుంటుంది

జిల్లాలో తాగునీటి సరఫరా పరిస్థితిపై ఎస్ఈ ప్రసన్నకుమార్ వివరించగా ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా పనిని పంచాయతీలు చూసుకుంటాయని, మీరు పర్యవేక్షిస్తే చాలని అన్నారు. జిల్లాకు వాటర్‌గ్రిడ్ పథకం రద్దయి కొత్తగా తాగునీటి పథకానికి రూ.2,700 కోట్లతో టెండర్లు పిలుస్తున్నట్లు చెప్పగా పెద్దపెద్దమాటలు వద్దులే అంటూ దాటవేశారు.

ముఖాముఖి 10 నిమిషాలే

తుమ్మనంగుట్ట ఆర్‌బీకేలో కరువు రైతులతో నిర్వహించిన ముఖాముఖి 10 నిమిషాలకే ముగిసింది. రైతులు శ్రీనివాసులురెడ్డి, రామలక్ష్మమ్మ పంటలు నష్టపోయామని బృందానికి వివరించారు. తరువాత గోపాల్ రెడ్డి అనే రైతు వ్యవసాయానికి ఉపాధిహామి పథకం అనుసంధానం చేయాలని కోరగా అది తమకు సంబంధం లేదన్నారు. రైతులకు ఉపయోగపడే చాలా పథకాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో కరువు బృంద సభ్యులు డెప్యూటి డైరెక్టర్ సుప్రియా మాలిక్, నీతి అయోగ్ పరిశోధనా అధికారి అనురాధ బటనా, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య విభాగం డెప్యూటీ అడ్వయిజర్ ఆశిశ్ పాండే, జాయింట్ కలెక్టర్ ఆదర్శరాజేంద్ర, మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్, వివిధశాఖల జిల్లా అధికారులు గుణశేఖర్‌పిళ్లై, రవిచంద్రారెడ్డి, లక్ష్మిప్రసన్న, వెంకట్, రషీద్‌ఖాన్, సురేష్‌బాబు, మదనపల్లె, స్థానిక అధికారులుపాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు అందించాలి

తంబళ్లపల్లి : ఎప్పుడు కరువు వచ్చినా అధిగమించే ప్రత్యామ్నాయ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులదేనని కేంద్ర కరువు బృందం టీమ్ లీడర్ పెరిన్‌దేవి సూచించారు. గ్రామ సచివాలయంలో రైతులతో ముఖాముఖి నిర్వహించారు. రైతులు సిద్దప్ప, మల్లిఖార్జున, తాళ్ల చంద్రశేఖర్ ప్రతి ఏడాది వర్షాధార పంటగా సాగు చేసే వేరుశనగ పంటతో పూర్తిగా నష్టం వాటిల్లుతోందన్నారు. కరువును అధిగమించే చర్యలలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని పెరిన్‌దేవి తెలిపారు. నాణ్యమైన విత్తనాలను అన్నదాతలకు అందించాలని, తమ విజ్ఞానాన్ని రైతులకు పంచి పెట్టాలని కేవీకే ప్రతినిధి శ్రీనివాస్‌కు సూచించారు.

మార్పు కోసం ఆలోచించాలి

కురబలకోట : రాయలసీమను రాళ్ల సీమగానే ఎన్నాళ్లు ఉంచదలచుకున్నారు..మార్పు తీసుకురావాలి..ఇందుకోసం ఆలోచించాలని కేంద్ర కరువు బృందం టీమ్ లీడర్ పెరిన్ దేవి పేర్కొన్నారు. కేంద్ర కరువు బృందం బుధవారం కురబలకోట మండలంలోని మట్లివారిపల్లెలో పర్యటించింది. పంటల స్థితి, భూగర్భ జలాలు, పశుగ్రాసం, పంట నష్టం తదితర విషయాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. తొలుత కరువు పరిస్థితులపై అధ్యయనం చేశారు. ఇక్కడ పరిశీలించిన అంశాలపై నివేదకను కేంద్రానికి సమర్పిస్తామని తెలిపారు.

ఇసుక సీజ్ చేశారు..
టీడీపీ నేతకు అమ్మేశారు!

- జిల్లాలో టీడీపీ నేతతో అధికారుల ములాఖత్
- టన్నుకు రూ.220 చొప్పున 3,300 టన్నులు ఇచ్చేశారు
- సీసీ రోడ్లకు మెటీరియల్ సరఫరాదారు పేరుతో ఒక్కరికే కట్టబెట్టారు
- ఆయన మూడు రోజుల్లోనే కర్ణాటకకు అక్రమంగా తరలించేశారు?



సోంపల్లి గ్రామంలో ఖాళీ అయిన సీజ్ చేసిన ఇసుక నిల్వలు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గంలో ఒక టీడీపీ నేతతో అధికారులు ములాఖత్ అయ్యారు. సీజ్ చేసిన ఇసుకను అక్రమంగా ఆయనకు కారుచౌకగా విక్రయించేశారు. ఆయన ఆ ఇసుకను బెంగళూరుకు తరలించి భారీగా సొమ్ము చేసుకున్నారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో హంద్రీ–నీవా, గాలేరు–నగరి ప్రాజెక్టుల అనుసంధానం పనుల కోసం కాంట్రాక్టర్ తంబళ్లపల్లె నియోజకవర్గం సోంపల్లె గ్రామంలో ఇసుకను నిల్వ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మైన్స్, రెవెన్యూ, పోలీసు అధికారులు ఆ ఇసుకను సీజ్ చేశారు. గతంలో సీజ్ చేసిన ఇసుకను అభివృద్ధి పనులకు వినియోగించుకోండి.. అని ఇటీవల కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారు. దీంతో అభివృద్ధి పనులకు మెటీరియల్ సరఫరాదారు అని పేర్కొంటూ టీడీపీ నియోజకవర్గ నేత బంధువు పేరుతో సోంపల్లెలో సీజ్ చేసిన 3,300 టన్నుల ఇసుకను అధికారులు కేటాయించారు.

ఆగమేఘాలపై అనుమతులు

సోంపల్లె గ్రామంలో సీజ్ చేసిన ఇసుకను టీడీపీ నేతలు చెప్పిన వ్యక్తికి అమ్మడంతోపాటు దానిని తరలించేందుకు అధికారులు ఆగమేఘాలపై అనుమతులను ఇచ్చారు. మొదట అభివృద్ధి పనులకు మెటీరియల్‌ను తరలించే సరఫరాదారు (పేరు పేర్కొనలేదు) ఇసుకను కొనుగోలు చేసేందుకు ఎంపికయ్యారని పంచాయతీరాజ్ (ప్రాజెక్ట్స్) ఈఈ డీసీ.శేఖర్‌రెడ్డి నంబర్ 11వ తేదీన మైనింగ్ అధికారులకు లేఖ రాశారు. అతను టన్నుకు రూ.220 చొప్పున మొత్తం 3,300 టన్నులకు రూ.7.26లక్షలు చెల్లించారని పేర్కొన్నారు. అదేవిధంగా నవంబర్ 13న ములకలచెరువు తహసీల్దార్‌కు కూడా ఈఈ లేఖ రాశారు. ఈ లేఖలో మాత్రం ఎం.శివప్రసాద్‌రెడ్డి అనే వ్యక్తి టన్నుకు రూ.220 చొప్పున 3,300 టన్నులకు రూ.7.26 లక్షలు చెల్లించారని, ఇసుకను తరలించుకునేందుకు నవంబర్ 14 నుంచి 16వ తేదీ వరకు మూడు టిప్పర్లు, ఒక జేసీబీకి అనుమతి ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ లేఖ ఆధారంగా తహసీల్దార్ కూడా వేగంగా స్పందించి అనుమతి ఇచ్చేశారు. దీంతో రాత్రి, పగలు అనే తేడా లేకుండా ఇసుకను మూడు రోజుల్లోనే అక్కడి నుంచి బెంగళూరుకు తరలించినట్లు తెలిసింది. అక్కడ 40 టన్నుల టిప్పర్ ఇసుకను రూ.లక్ష వరకు విక్రయించినట్లు సమాచారం. మార్కెట్‌లో టన్ను ఇసుక ధర రూ.2,200 నుంచి రూ.2,800 పలుకుతోంది. దీంతో ఇక్కడ రూ.220లకే దక్కించుకున్న ఇసుకను బెంగళూరుకు తరలించి భారీగా సొమ్ము చేసుకున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి తంబళ్లపల్లి నియోజకవర్గంలో జరిగే అభివృద్ధి పనులకు 1,500 టన్నుల ఇసుక సరిపోతుందని, ఈ పనులు కూడా పలువురు టీడీపీ నాయకులు స్థానికంగా దొరికే ఇసుకతోనే చేస్తున్నారని అధికారులకు తెలుసు. అయినా ఒకే వ్యక్తికి సీజ్ చేసిన 3,300 టన్నుల ఇసుకను విక్రయించడం వెనుక పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

కరువు మండలాలను ఆదుకోండి

కేంద్ర బృందానికి కలెక్టర్ శ్రీధర్ వినతి



మదనపల్లె : జిల్లాలో తీవ్రమైన కరువును ఎదుర్కొన్న మండలాలను ఆదుకునేందుకు కేంద్రప్రభుత్వం సహాయం చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి కోరారు. అన్నమయ్యజిల్లాలో కరువు మండలాల క్షేత్రస్థాయి పరిశీలన కోసం కేంద్రప్రభుత్వం సుప్రియామాలిక్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ముగ్గురు సభ్యుల బృందం బుధవారం జిల్లాలో పర్యటించింది. ఖరీఫ్ సీజన్‌లో పడిన వర్షపాతం, పశువులకు అందుబాటులోని పశుగ్రాసం, పంటనష్టాలు తదితర విషయాలపై రైతులతో చర్చించారు. అనంతరం మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో కేంద్ర బృందంతో కలిసి వివిధ శాఖల జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లాలోని కరువుమండలాల దుస్థితిని కేంద్రబృందానికి వివరించారు. రాష్ట్రప్రభుత్వం అక్టోబర్‌లో జిల్లాలోని 19 మండలాలను కరువుమండలాలుగా ప్రకటించిందన్నారు. ఖరీఫ్–2024 సీజన్‌లో జూన్ నుంచి సెప్టెంబర్ వరకు వర్షపాతం తక్కువగా కురవడంతో పలు మండలాల్లో కరవు పరిస్థితులు ఏర్పడి పశుగ్రాసంకు రైతులు ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రైవేట్ ట్యాంకర్ల ద్వారా నీటిని అందించామన్నారు. క్రాప్ డ్యామేజీ కింద రూ.11.37 కోట్ల నష్టం వాటిల్లినట్లు నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ బృందానికి నివేదిక అందించామన్నారు. జిల్లాలో 30 మండలాలకు 19 మండలాలు అత్యంత తీవ్రమైన కరువును ఎదుర్కొన్నాయని, వివిధశాఖల జిల్లా అధికారులు అందించిన నివేదికల మేరకు కరువు మండలాలకు కేంద్రప్రభుత్వం సహాయం చేయాల్సిందిగా కేంద్రప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, డీఏఓ చంద్రానాయక్ తదితరులు పాల్గొన్నారు.

రుణాల మంజూరులో టెక్నికల్ కమిటీ నిర్ణయాన్ని పాటించాలి

రాయచోటి : జిల్లా స్థాయి టెక్నికల్ కమిటీ నిర్ణయం మేరకు రైతులకు రుణాలు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డీసీసీబీ బ్యాంకు సీఈఓ రాజారమణి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చంద్రనాయక్‌లు సమావేశానికి సంబంధించిన వివిధ అంశాలపై జిల్లా కలెక్టర్, కమిటీ సభ్యులకు వివరించారు. సమావేశంలో డీసీసీబీ బ్యాంక్ సీఈఓ రాజారమణి, ఎల్‌డీఎం ఆంజనేయులు పాల్గొన్నారు.

- మహిళా శిశు సంక్షేమం, ప్రజల ఆరోగ్య సంరక్షణ అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యంలో చిత్తశుద్ధితో ప్రగతి సాధించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ ఐసీడీఎస్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలో కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమానికి సంబధించిన ప్రచార పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు.

సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌కు రెండు ప్రాజెక్టులు



అధికారుల చేతులు మీదుగా మెమెంటో, సర్టిఫికెట్లను అందుకుంటున్న విజేతలు

రాయచోటి : విజయవాడలోని మురళీ రీసార్ట్స్‌లో ఈనెల 7,8వ తేదీల్లో రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్ నిర్వహించారు.ఇందులో అన్నమయ్య జిల్లా నుంచి రెండు ప్రాజెక్టులు సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌కు ఎంపికయ్యాయని జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్ రెడ్డి తెలిపారు. టీచర్ విభాగంలో చిట్వేలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన శివ నారాయణ గౌడ్ రూపొందించిన ప్లాస్టిక్ వ్యర్థాల నుంచి కాపర్ కోటెడ్ బాటిల్ ప్రాజెక్టు, గ్రూపు విభాగం నుంచి కలకడ మోడల్ స్కూల్‌కు చెందిన మహమ్మద్ సుహేల్, రెహాన్ రూపొందించిన బయో ఎంజైమ్స్ ప్రాజెక్టు రాష్ట్రస్థాయిలో విజేతలుగా నిలిచాయన్నారు. గ్రూపు ప్రాజెక్టుకు సుమతి గైడ్ టీచర్‌గా వ్యవహరించినట్లు తెలిపారు. సైన్స్ ఫెయిర్‌లో సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు, ఎస్‌సిఈఆర్‌టీ డైరెక్టర్ వెంకటకృష్ణారెడ్డి, విశ్వేశ్వరయ్య యూనివర్సిటీ ప్రొఫెసర్ పురుషోత్తం చేతుల మీదుగా వీరు మెమెంటో, సర్టిఫికెట్లను అందుకున్నారు. ఈనెల 20 నుంచి 25 వరకు పాండిచేరిలో నిర్వహించే దక్షణ భారత దేశ సైన్స్ ప్రదర్శనలో వీరు పాల్గొంటారన్నారు. విజేతలు, గైడ్ టీచర్లను జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యం, ఉప విద్యాశాఖఅధికారి శివప్రకాష్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి ఓబుల్ రెడ్డి, విజేతలను, గైడ్ టీచర్లను అభినందించారు.

జాతీయస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

కలకడ : జాతీయస్థాయి పోటీలకు కోన ప్రభుత్వ ఉన్నతపాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు మోడెం చెంగల్ రాయుడు తెలిపారు. గత సంవత్సరం రాజమండ్రి, విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో కలకడ మండలం, కోన పాఠశాలకు చెందిన 10వతరగతి విద్యార్థి మిడపల యోగేశ్వర్, 9వతరగతి చదువుతున్న షేక్ సమీరాలు ఉత్తమ ప్రతిభ కనబరిచారని తెలిపారు. వీరిద్దరు జనవరి 10 నుంచి తెలంగాణలోని మహబూబ్‌నగర్‌లో జరిగే జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులు, ఫిజికల్ డైరెక్టర్ ఝాన్సీరాణికి అభినందనలు తెలిపారు.

క్లుప్తంగా

స్పిన్నింగ్ మిల్స్ వర్కర్స్ అధ్యక్షుడిగా శేషారెడ్డి



యూనియన్ అధ్యక్షుడిగా వై.వి.శేషారెడ్డిని ప్రకటిస్తున్న జనరల్ సెక్రటరీ

మదనపల్లె : మదనపల్లె స్పిన్నింగ్ మిల్స్ వర్కర్స్ యూనియన్, ఎఫ్–100 నూతన అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన న్యాయవాది వై.వి.శేషారెడ్డిని సభ్యులు ఎన్నుకున్నారు. బుధవారం సీటీఎం యూనియన్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరిగింది. కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ జి.భాస్కరరెడ్డి మాట్లాడుతూ యూనియన్ గౌరవాధ్యక్షుడు నందగోపాల్ ఆకస్మిక మరణంతో అధ్యక్ష పదవికి ఎన్నికలు జరపాలని నిర్ణయించామన్నారు. అందులో భాగంగా న్యాయవాది వై.వి.శేషారెడ్డిని మదనపల్లె స్పిన్నింగ్ మిల్స్ వర్కర్ యూనియన్ నూతన అధ్యక్షుడిగా సమావేశానికి హాజరైన 210 మంది కార్మికులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని తెలిపారు.

మళ్లీ కనిపించిన చిరుతపులి

రామసముద్రం : రామసముద్రం మండలంలో తిరిగి చిరుత పులి ప్రజల కంట పడటంతో పరిసర ప్రాంతాల ప్రజలు భయాందోళనకు గురయ్యారు. గుంతయంబాడీకి చెందిన పెద్ద చెరువు కట్టలో వై. కురప్పల్లి గ్రామానికి చెందిన వెంకట్రమణకు బుధవారం ఉదయం చెరువు కట్టపై చిరుత కనిపించింది. ఈ విషయాన్ని గ్రామస్తులకు తెలియడంతో గుంతయంబాడీ, వై. కురప్పల్లి, గుండ్లపల్లి గ్రామాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున చెరువు వద్దకు చేరుకొని గాలించారు. విషయం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ చిట్టిబాబుకు తెలియడంతో సంఘటన స్థలానికి చేరుకొని విచారించారు. ప్రజలు పశువులు, మేకలు తోలుకొని పెద్ద చెరువులోకి వెళ్లవద్దని సూచించారు.

నేడు అన్నమాచార్య విశ్వవిద్యాలయం ప్రారంభం

రాజంపేట : అన్నమాచార్య విశ్వవిద్యాలయం ప్రారంభోత్సవాన్ని గురువారం అట్టహాసంగా నిర్వహించనున్నారు. ఈ సభలో హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, ప్రముఖ హాస్యనటుడు డాక్టర్ కె.బ్రహ్మానందం, యువనటుడు కిరణ్ అబ్బవరం, ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్ చౌదరి తదితరులు పాల్గొంటారన్నారు.

భళిరా.. బసవా!

- అయ్యవారికి ..అమ్మవారికి దండం పెట్టు
- పూర్వీకుల నుంచి వారసత్వం
- సంక్రాంతి పండుగ నెలలోనే బసవన్నల ఆటపాటలు
- ఎద్దుల పోషణ భారంగా మారిందంటూ నిట్టూర్పు
- ఇదీ గంగిరెద్దుల వాళ్ల జీవన చిత్రం





గంగిరెద్దులతో కాలనీలోకి వెళుతూ..

మదనపల్లె సిటీ : సన్నాయి.. మేళతాళాలతో ఓ రాముడూ అమ్మగారికి నమస్కరించు.. అయ్యగారికి దండం పెట్టూ. సీతమ్మా వచ్చి రాముడు పక్కన నిలబడు.. లక్ష్మణా రాముడి పక్కన నిలబడు.. హనుమంతూ పల్టీలు కొట్టు ఇలా ఇంటి ముంగిట ముగ్గులలో గొబ్బెమ్మల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ బసవన్నలను ఆడిస్తూ అందరినీ ఆహ్లాదపరుస్తారు గంగిరెద్దుల వాళ్లు . సంక్రాంతి వచ్చిందంటే వీరికి మూడు నెలలు పండుగే. గజ్జెలు కట్టి రంగు రంగుల వస్త్రాలతో బసవన్నలను అలంకరించి ఊరూరా తిరుగుతూ సందడి చేస్తారు. సంప్రదాయబద్ధంగా వస్తు న్న కళను వదులుకోలేక.. భారమైనా జీవితాన్ని ఈ డ్చుకుంటూ వస్తున్నారు. ఉన్న ఊరు వదిలి వందల కిలోమీటర్లు వచ్చి ఊరికి దూరంగా ఉన్న ఖాళీ స్థలాల్లో గుడారాలు వేసుకుని బతుకుబండి లాగుతున్నారు.

మదనపల్లె పట్టణం అమ్మచెరువుమిట్ట వద్ద గుంటూరు జిల్లా వినుకొండ సమీపంలోని ఉప్పరపాలెంకు చెందిన గంగిరెద్దులవాళ్లు సుమారు 15 కుటుంబాలు ఇక్కడ గుడారాలు వేసుకుని జీవిస్తున్నారు. ధనుర్మాసం ప్రారంభంలోనే ఇక్కడికి చేరుకుంటారు. శివరాత్రి వరకు సమీప శివారు ప్రాంతాల్లో, కాలనీల్లో గంగిరెద్దులను ఆడిస్తారు. ఇది వీరి జీవన విధానం.

ఆకర్షణీయంగా అలంకరణ

ఎద్దుకు వారు చెప్పినట్లుగా ఆడేలా శిక్షణ ఇచ్చి అలంకరిస్తారు. మూపురం నుంచి తోక వరకు రంగు రంగులతో కుట్టిన దొంతలు, పాత పట్టుచీరలను అలంకరిస్తారు. కొమ్ములకు రింగులు తీర్చిదిద్ది వాటికి గొట్టాలను ధరింపజేసి రంగుల నూలు దారాలను కడతారు. నొసటి భాగంలో తోలుతో అలంకరించిన గువ్వలు వేలాడదీస్తారు. ఇలా ఉదయమే అలంకరణ చేసి గ్రామాల్లోకి బయలుదేరుతారు. బృందాలుగా విడిపోయి రోజంతా తిరిగితే రూ.1,000 నుంచి 1500 వస్తాయి. అందులో గంగిరెద్దులకు గడ్డి, పోషణకు పోతే వీరికి అంతంత మాత్రమే మిగులుతుంది. ఆవు కంట తడి పెడితే ఇంటికి మంచిది కాదు. అందుకే వాటిని కన్నబిడ్డల కంటే ఎక్కువ చూసుకుంటారు. ఉదయం నుంచి మధ్యాహ్నం 12 వరకు తిరిగి గుడారాల వద్దకు చేరుకుంటారు. శివరాత్రి తరువాత వారి గ్రామాలకు వెళ్లిపోతారు.

సన్నాయి, బూర..

గంగిరెద్దులను ఆడించే వారి వేషధారణ సైతం ప్రత్యేకంగా ఉంటుంది. చేతిలో సన్నాయి, బూర, చిన్న గంట పట్టుకుంటారు. పాతకోటు ధరించి తిరుగుతుంటారు. ఎక్కడికి వెళ్లినా.. సన్నాయి, బూర శబ్దం వచ్చిందంటే గంగిరెద్దులోళ్లు వచ్చారని ఇట్టే అర్థమవుతుంది.

ఆదరణ తగ్గింది



గంగిరెద్దులను ఆడించడం కోసం సంచార జీవనం గడుపుతున్నాం. నా చిన్నతనం నుంచి ఇదే వృత్తి. ఏడాదిలో పండుగ పూట మాత్రమే గంగిరెద్దులతో తిరుగుతాం. ధనం, ధాన్యం, గడ్డి ఇచ్చేవారు తగ్గిపోయారు. కొందరు డబ్బులు ఇస్తే, మరికొందరు బియ్యం పెడుతున్నారు. ఇంతకు ముందులా ఆదరించడం లేదు. అయినా పెద్దల నుంచి వచ్చిన తానవాయితీని కొనసాగిస్తున్నాం.

– త్రిమూర్తి, గంగిరెద్దురోళ్లు

మా కష్టాలు గుర్తించండి



గంగిరెద్దులతో ఇంటింటా తిరుగుతూ బసవన్నలతో సందడి చేస్తాం. మా ఆధారం ప్రకారం అందరం మూడు నెలలు పట్నంలో ఉంటాం. పండుగ రోజు మాత్రం ఊర్లో ఆఫీసర్లు ప్రోగ్రాంకు గంగిరెద్దులతో రమ్మంటారు. ఆట ఆడిన తరువాత మమ్మల్ని పట్టించుకోరు. మా కష్టాలు గుర్తించి ఆదుకోవాలి.

– ఈశ్వర్, గంగిరెద్దురోళ్లు

డ్రిప్ ఇరిగేషన్‌కు రూ.450 కోట్లు మంజూరు

ఉద్యానవన, పట్టు పరిశ్రమల శాఖ డైరెక్టర్ కె.శ్రీనివాసులు



అవకాడో మొక్కను పరిశీలిస్తున్న డైరెక్టర్ కె.శ్రీనివాసులు

పెద్దతిప్పసముద్రం : రాష్ట్రంలో డ్రిప్ ఇరిగేషన్ కోసం రూ.450 కోట్ల నిధులు మంజూరు చేశామని ఉద్యానవన, పట్టు పరిశ్రమల శాఖ రాష్ట్ర డైరెక్టర్ కె.శ్రీనివాసులు అన్నారు. బుధవారం ఆయన మండలంలోని మదుమూరులో పారిశ్రామికవేత్త కొండా నరేంద్రకు చెందిన ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. 70 ఎకరాల్లో సాగు చేస్తున్న అరటి, ఉసిరి, వక్క, టెంకాయ, మామిడి, అల్లనేరేడు, నిమ్మ తదితర పండ్ల తోటలను పరిశీలించారు. ప్రధానంగా మెక్సికో నుంచి ఒక్కో మొక్కను రూ.400లతో కొనుగోలు చేసి 16 ఎకరాల్లో సాగు చేస్తున్న అవకాడో పంట గురించి ఆరా తీశారు. సేంద్రియ ఎరువుల తయారీ విధానం, పంటల మార్కెటింగ్, ఆవు పేడను లిక్విడ్‌గా వాడుకుని స్వచ్ఛమైన వేపనూనెతో జీవామృతం తయారీ విధానాన్ని తెలుసుకున్నారు. అనంతరం ఆయన పీటీఎం సమీపంలోని రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘాన్ని తనిఖీ చేసి రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతులు ప్రధానంగా సేంద్రియ ఎరువులు వాడుతూ సాధారణ పంటలతో పాటు లాభదాయకమైన అంతర్ పంటలపై దృష్టి సారించేలా, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందే విధానం, ప్రభుత్వ రాయితీలపై రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ఆయన వెంట డీఎంఐఏఓ లక్ష్మీ ప్రసన్న, హెచ్ఓ ఈశ్వర్ ప్రసాద్‌రెడ్డి, సిరికల్చర్ ఏడీ రామమోహన్, భీమేష్, ఆర్ఎస్‌కే అసిస్టెంట్లు మహబూబ్‌బాషా, మురళీ తదితరులు పాల్గొన్నారు.

విదేశాలకు లక్ష టన్నుల అరటి ఎగుమతి

బి.కొత్తకోట : రాష్ట్రం నుంచి ఈ ఏడాది లక్ష టన్నుల అరటిని ఎగుమతి చేయనున్నామని ఉద్యానవనశాఖ డైరెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు తెలిపారు. అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలంలోని కోటావూరులో సెరికల్చర్, హార్టికల్చర్ గ్రామ సహాయకులతో సమావేశం నిర్వహించారు. తర్వాత కర్ణాటక సరిహద్దులోని ఉద్యానవన పంటలు, పాలీహౌస్‌లను బుధవారం ఆయన పరిశీలించారు. గులాబీతోటల పెంపకాన్ని పరిశీలించి, రైతులతో మాట్లాడారు. అనంతరం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ టర్కీ, సౌదీ అరేబియా దేశాలకు ఇప్పటివరకు 35వేల టన్నుల అరటి ఎగుమతి చేశామన్నారు. మామిడిని అమెరికా, అరేబియా దేశాలకు 5వేల టన్నులు ఎగుమతి చేశామన్నారు. రాష్ట్రంలో రూ.3,875 కోట్లతో ఉద్యానపంటలు, సూక్ష్మనీటిపారుదల కోసం ఖర్చుచేస్తున్నట్లు తెలిపారు. ఇందులో మైక్రో ఇరిగేషన్‌కు రూ.2,200 కోట్లు, పాలీహౌస్, హార్టికల్చర్‌కు రూ.371కోట్లు ఖర్చుచేస్తున్నట్లు చెప్పారు. జీడీపీని పెంచడం, రైతులకు ఉపయోగంగా ఉండే 11 రకాల పంటలను గుర్తించామని చెప్పారు. రాష్ట్రాన్ని 24 క్లస్టర్‌లుగా విభజించి ఏ క్లస్టర్‌లో ఏ పంట సాగవుతుందో, ఆ క్లస్టర్ పరిధిలోకి తెచ్చామన్నారు. ప్రస్తుతం 18.47 లక్షల హెక్టార్లలో హార్టికల్చర్ పంటలు సాగవుతున్నాయన్నారు. అవకాడో, డ్రాగన్‌ఫ్రూట్, డేట్స్ తదితర అధిక ధర కలిగిన పండ్లకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. సూక్ష్మసాగును పెంచడం కోసం 3లక్షల హెక్టార్లకు డ్రిప్ ఇవ్వనున్నట్లు తెలిపారు. హార్టికల్చర్ పంటకు దిగుబడి రావాలంటే ఐదేళ్లు పడుతుందని, ఈలోపు అంతరపంటల సాగుకు ప్రోత్సహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి వై.లక్ష్మీప్రసన్న, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కురబలకోట మండల మీట్ నిర్వహించాలి

ఎంపీడీఓకు హైకోర్టు ఆదేశం



హైకోర్టు ఆదేశాలను ఎంపీడీఓకు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎంపీటీసీలు

కురబలకోట : ఈనెల 17న ఉదయం పది గంటలకు జరగాల్సిన కురబలకోట మండల మీట్‌ను సజావుగా నిర్వహించాలని హైకోర్టు స్థానిక ఎంపీడీఓ గంగయ్యను ఆదేశించింది. ఈమేరకు మండల పరిషత్ వైస్ ప్రెసిడెంట్ ఎంజీ భూదేవి, వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులు ఆనందరెడ్డి, రవీంద్రరెడ్డి, త్రివేణి గోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు కోళ్ల వాసుదేవరెడ్డి, సర్పంచ్ ఆర్కే కృష్ణారెడ్డి తదితరులు బుధవారం కోర్టు ఆదేశాలను ఎంపీడీఓకు అందజేశారు. వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు మండల మీట్‌కు హాజరయ్యేందుకు తగిన రక్షణ, భద్రతతో పాటు పటిష్ఠ చర్యలు చేపట్టాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. బయటి వ్యక్తులు సభ్యులను అడ్డుకోకుండా చూడాలన్నారు. ఈ విషయమై ఎంపీడీఓ గంగయ్య మాట్లాడుతూ సజావుగా సమావేశం నిర్వహించే విషయం ఇప్పటికే పోలీసుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

ద్విచక్రవాహనం అదుపు తప్పి ప్రభుత్వ ఉద్యోగి మృతి

తొండూరు : తొండూరు ఎంపీడీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కోకటం శ్రీనివాసులరెడ్డి(52) ద్విచక్ర వాహనం అదుపు తప్పి అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికుల కథనం మేరకు.. బుధవారం శ్రీనివాసులరెడ్డి సైదాపురం నుంచి కోవరంగుంటపల్లెకు వ్యక్తిగత పనులమీద వెళ్లారు. తిరిగి స్వగ్రామమైన సైదాపురానికి వస్తుండగా, గ్రామ సమీపంలోని చీనీ తోట వద్దకు రాగానే బైకు అదుపు తప్పి గుంతలో పడటంతో కిందపడ్డారు. దీంతో శ్రీనివాసులరెడ్డి బండ రాయిపై పడటంతో తలకు బలమైన రక్తపు గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. గ్రామస్తులు, బంధువులు ఘటనా స్థలానికి చేరుకుని ఆవేదన చెందారు.

ప్రైవేటీకరణ చేసేందుకే వైద్యసేవలు నిర్వీర్యం

వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిసార్ అహ్మద్



మదనపల్లె : జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, మదనపల్లె మెడికల్ కాలేజ్ రెండింటినీ ప్రైవేటీకరణ చేసేందుకే ఉద్దేశపూర్వకంగా ఆస్పత్రిలో వైద్యసేవలు నిర్వీర్యం చేస్తున్నారని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ ఆరోపించారు. బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదలకు కార్పొరేట్, మల్టీస్పెషాలిటీ వైద్యసేవలు అందించేందుకు, విద్యార్థులు స్థానికంగా వైద్యవిద్యను అభ్యసించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి పార్లమెంటరీ పరిధిలో మెడికల్ కాలేజీ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారన్నారు. అందులో భాగంగా రాజంపేట పార్లమెంట్‌కు మంజూరైన మెడికల్ కాలేజీని మదనపల్లెలో ఏర్పాటు చేసేలా ఎంపీ మిథున్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ కనబరిచారన్నారు.

ఈ విద్యాసంవత్సరానికి తరగతులు ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తుండగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కాలేజీ నిర్మాణ పనులు నిలిపివేసి, ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించేందుకు సన్నాహాలు ప్రారంభించిందన్నారు. ఏ సదుద్దేశంతో అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మదనపల్లె మెడికల్ కాలేజీని, జిల్లా ఆస్పత్రిని ఆధునీకరించిందో ఆ ఉద్దేశం నీరుగారిపోతోందన్నారు. ప్రజల పక్షాన పోరాటా నికి వైఎస్సార్‌సీపీ సిద్ధంగా ఉంటుందన్నారు.

సీమకే తలమానికం అన్నమాచార్య విశ్వవిద్యాలయం

రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథ రెడ్డి



అవార్డుల ప్రదానోత్సవ సభలో పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి , ఏయూ చాన్స్‌లర్ చొప్పా గంగిరెడ్డి

రాజంపేట : రాయలసీమకే అన్నమాచార్య విశ్వవిద్యాలయం తలమానికంగా నిలుస్తోందని రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథ రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి ఏయూ క్యాంపస్‌లో రెండవ రోజు ఏర్పాటు చేసిన ఏఐటీఎస్ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలను ఏయూ చాన్స్‌లర్ చొప్పా గంగిరెడ్డి, ప్రో చాన్స్‌లర్ చొప్పా అభిషేక్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎందరో విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాట వేసే విధంగా ఏఐటీఎస్ ముందుకు వచ్చిందన్నారు. రాజంపేట ప్రాంతం విద్యాహబ్‌గా మారేందుకు ఏయూ మార్గదర్శకంగా నిలవాలన్నారు. ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ డాక్టర్ జి.సతీష్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకత, పట్టుదల, నైతిక విలువలు పెంపొందించేందుకు ఏయూ వేస్తున్న అడుగులు అద్భుతనీయమన్నారు. ఏయూ చాన్స్‌లర్ చొప్పా గంగిరెడ్డి మాట్లాడుతూ వివిధ రంగాలలో రాణించిన 25 మంది ప్రముఖులకు ఏయూ రెసోనెన్స్ అవార్డులను అందజేసి సత్కరించడం గర్వకారణంగా ఉందన్నారు. ఏయూ ప్రో చాన్స్‌లర్ చొప్పా అభిషేక్‌రెడ్డి మాట్లాడుతూ అన్నమాచార్య యూనివర్సిటీ కేవలం విద్యకే పరిమితం కాకుండా సామాజిక సేవలో కూడా ఏయూ ముందుకు దూసుకెళుతోందన్నారు. కార్యక్రమంలో ఏఐటీఎస్ వైస్‌చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్.మల్లికార్జునరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణ, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నమాచార్య కమ్యూనిటీ రేడియో స్టేషన్ ప్రారంభం

ఏయూలో అన్నమాచార్య కమ్యూనిటీ రేడియో స్టేషన్‌ను రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి ప్రారంభించారు. భారత ప్రభుత్వ సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖవారిచే అనుమతించిన రేడియో స్టేషన్ (98.6 మెగాహెడ్జ్‌స్)ని అందుబాటులోకి తీసుకొచ్చారు.

అవార్డులు అందుకున్నది వీరే..

జేఎన్‌టీయూ వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ సుదర్శన్, వైవీయూ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ కృష్ణారెడ్డి, పీవీకేకే గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూట్, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, రాయలసీమ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ చైర్మన్ కొండారెడ్డి, కేఎస్‌ఆర్‌ఎం గ్రూపు కరస్పాండెంట్ కె.రాజేశ్వరి, ఎస్‌టీకేఆర్‌ఐఎస్‌టీ డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, ఉన్నతమైన కంపెనీ హెచ్‌ఆర్‌లు కీర్తినాయక్, టెక్ మహేంద్ర అబ్దుల్లా రహీం, ఐటీసీ ఇన్ఫోటెక్ ఎండీ జాషువా డేవిడ్, సినీ ప్రముఖులు సోమసుందరం, లాస్య, జయచంద్ర, వివిధ రంగాలలో అత్యుత్తమ స్థాయిలో నిలిచిన ఏఐటీఎస్ పూర్వ విద్యార్థులు అన్నమాచార్య యూనివర్సిటీ రెసోనెన్స్ అవార్డులను అందుకున్నారు.


పదిలో ఉత్తమ ఫలితాల కోసం కృషి చేయాలి



విద్యార్థుల సామర్థ్యాలపై ఆరా తీస్తున్న విద్యాశాఖాధికారి

సంబేపల్లె : మార్చి నెలలో నిర్వహించనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యం తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో పదవతరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

ఆలయ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవు



దేవాలయ మాన్యాల వివరాలను పరిశీలిస్తున్న జిల్లా దేవదాయశాఖ అధికారి విశ్వనాథ్

వీరబల్లి : ఆలయ భూములు ఆక్రమణ చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా దేవదాయశాఖ అధికారి సి.విశ్వనాథ్ అన్నారు. గడికోటలో బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ గడికోట గ్రామంలో రాయచోటి వీరభద్ర స్వామి ఆలయానికి 179 ఎకరాల మాన్యాలు ఉన్నాయన్నారు. 44 ఎకరాలకు రెవెన్యూ రికార్డులు ఉన్నాయని, మిగిలిన 135 ఎకరాలకు రెవెన్యూ రికార్డులు లేవన్నారు. ఈ విషయంపై త్వరలో ఆరా తీస్తామన్నారు.కొన్నిచోట్ల దేవాలయ భూములను అనుభవిస్తూ కౌలు చెల్లించకుండా ఉన్నారని అలాంటి రైతులు వెంటనే దేవాలయాలకు కౌలు చెల్లించి మండల దేవదాయ అధికారుల నుంచి రశీదులు పొందాలన్నారు. అనంతరం తహసీల్దార్ శ్రావణితో కలిసి ఆలయ భూముల రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వీరభద్ర ఆలయ ఈఓడీసీ రమణారెడ్డి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పాత్రికేయులను బెదిరిస్తే ఉపేక్షించేదిలేదు

ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాజంపేట : పాత్రికేయులను బెదిరిస్తే ఉపేక్షించేదిలేదని జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు హెచ్చరించారు. బుధవారం రాజంపేటకు వచ్చిన ఎస్పీని స్థానిక రోడ్లు భవనాల అతిథి గృహంలో స్థానిక విలేకరులతో కలిసి బాధితుడు కూరాకు శ్రీను అనే విలేకరి తనకు న్యాయం చేయాలని విన్నవించారు. సోమవారం పుల్లంపేట మండలం రామక్కపల్లెకు చెందిన సుబ్రహ్మణ్యానాయుడు(మణి) అనే వ్యక్తి తనను బెదిరించాడని రాజంపేట ఎస్‌డీపీఓ సుధాకర్‌కు ఫిర్యాదు చేసినా ఎలాంటి స్పందనలేదన్నారు. వెంటనే ఎస్పీ సానుకూలంగా స్పందించారు. నిందితుడిపై కేసు నమోదు చేయాలని అక్కడే ఉన్న డీఎస్పీని ఆదేశించారు. ఎస్పీ వెంట రైల్వేకోడూరు సీఐ హేమసుందరం, మన్నూరు సీఐ అలీ, రూరల్ సీఐ రమణ, పలువురు ఎస్ఐలు ఉన్నారు.

హత్య కేసు కొట్టివేత

రాయచోటి టౌన్ : శిబ్యాల గ్రామం వైకుంఠ రాచపల్లి ఎర్రచెరువులో మేకలు మేపుతున్న మహిళ హత్య కేసును కోర్టు కొట్టి వేసింది. 2013లో ఈ హత్య సంచలనం సృష్టించింది. పోలీసులు ఎన్.సాంబశివ, ఎం. బాలాజీ, మరో ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. బుధవారం ఈ కేసును ఐదవ జిల్లా జడ్జి కృష్ణ కుట్టిన్ కొట్టి వేసినట్లు ముద్దాయిల తరపు న్యాయవాది నాగముని తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన సుశీలమ్మ, గురుమూర్తి

మదనపల్లె : వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మదనపల్లె మండలం పున్నేటి పాలెం గ్రామానికి చెందిన శంకరప్ప భార్య సుశీలమ్మ (65), గొల్లపల్లెలో ఉన్న కుమారుడి ఇంటికి వెళ్లింది. తిరిగి సాయంత్రం ద్విచక్ర వాహనంలో కొడుకుతో కలసి వస్తుండగా పట్టణంలోని పోస్ట్ ఆఫీస్ సమీపంలో వాహనం నుంచి జారిపడి తలకు దెబ్బ తగిలి తీవ్రంగా గాయపడింది. కలికిరి మండలం మేడికుర్తి గ్రామానికి చెందిన నాగరాజు కుమారుడు గురుమూర్తి(48), డ్రిప్ పైపులు కొనుగోలు చేసేందుకు ద్విచక్ర వాహనంలో పుంగనూరుకు వెళ్తుండగా, నల్లగుట్లపల్లె సమీపంలో పెద్దపంజాణి వైపు వెళ్తున్న ఆటో ఢీకొనడంతో, తలకు దెబ్బ తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. ఆయా ఘటనల్లో గమనించిన స్థానికులు బాధితులను 108 వాహనాల ద్వారా మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసులు విచారణ చేస్తున్నారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి మృతి



శ్రీధర్ (ఫైల్)

మదనపల్లె : ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వన్ టౌన్ సీఐ ఎరీషావలీ తెలిపారు. ములకలచెరువు మండలం బురకాయలకోటకు చెందిన శ్రీధర్ (37) 15 ఏళ్ల క్రితం తన భార్య భవానీతో కలిసి ఉపాధి నిమిత్తం మదనపల్లెకు వచ్చాడు. పట్టణంలోని రెడ్డీస్ కాలనీలో నివసిస్తూ పండ్ల వ్యాపారం చేస్తూ, నిమ్మనపల్లె సర్కిల్‌లో ఉన్న వైన్ షాప్‌లో పనిచేసేవాడు. భార్య భవాని స్థానికంగా ఓ ప్రైవేట్ స్కూల్లో పనిచేస్తుంది. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొంతకాలంగా శ్రీధర్ అనారోగ్యానికి గురి కావడం, ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో, తీవ్ర మనస్థాపానికి గురై ఈనెల 6న ఇంట్లోనే బాత్రూంలోకి వెళ్లి గడియ పెట్టుకుని విష ద్రావణం తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన స్థానిక ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు వన్ టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. మృతుని భార్య భవాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

700 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత



అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎఫ్ బియ్యం బస్తాలలో కొన్ని

రాయచోటి : రేషన్ బియ్యం అక్రమ తరలింపుపై పోలీసులు, రెవెన్యూ అధికారులు ఉక్కుపాదం మోపారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలోని ఓ రైస్ మిల్లులో తరలింపునకు సిద్ధంగా ఉన్న 350 క్వింటాళ్ల (700 ప్యాకెట్లు) పీడీఎఫ్ బియ్యాన్ని స్పెషల్ పార్టీ పోలీసులు మంగళవారం అర్ధరాత్రి గుర్తించారు. పట్టుబడిన బియ్యం సమాచారాన్ని జేసీ ఆదర్శ రాజేంద్రన్‌కు తెలిపారు. రేషన్ బియ్యం తరలింపు వ్యవహారంపై జిల్లా కలెక్టర్ అధికారులకు సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. అయినా అక్రమార్కులు అక్రమ రవాణాను ఆపడం లేదు. రైస్ మిల్లుల కేంద్రంగా జరుగుతున్న ఈ గుట్టును రట్టు చేశారు.

రాయచోటిలో మంగళవారం అర్ధరాత్రి పట్టుబడిన 700 ప్యాకెట్ల బియ్యం బస్తాలను సీజ్ చేసి కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు అర్బన్ ఎస్ఐ నరసింహారెడ్డి తెలిపారు. పట్టుబడిన బియ్యం ఎవరివి అనే విషయాన్ని ఇంకా ధ్రువీకరించలేదన్నారు. విచారణలో నిందితులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పట్టుబడిన బియ్యాన్ని ఎస్పీ ఆదేశాల మేరకు అర్బన్ సీఐ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో రాయచోటి రెవెన్యూ అధికారులకు అప్పగించామన్నారు.

విండో పదవి నీకా..నాకా..!

- కూటమిలో కుదరని ఏకాభిప్రాయం
- పదవుల కోసం పోటాపోటీ

కురబలకోట : కురబలకోట మండల సింగిల్ విండో అధ్యక్ష పదవి కోసం కూటమి నాయకుల మధ్య సమన్వయం కొరవడింది. బుధవారం అంగళ్లు గ్రామం తుమ్మచెట్లపల్లెలోని కార్యాలయంలో కూటమి నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. త్రీమెన్ కమిటీ ఎంపికపై ఏకాభిప్రాయం కుదరలేదు. దీంతో ఆశావహుల పేర్లను అధిష్టానికి పంపుతున్నట్లు టీడీపీ రాజంపేట బీసీ సెల్ అధ్యక్షుడు పి. సురేంద్ర యాదవ్ తెలిపారు. పైరవీలు చేసేవారికి కాకుండా పార్టీ కోసం కష్టపడిన వారికే పదవులు ఇతర నామినేటెడ్ పదవులు ఇస్తామన్నారు. ఇదిలా ఉండగా విండో పదవిని ఆశిస్తూ టీడీపీతో పాటు కూటమి నాయకులు 35 మంది దాకా ఆశావహులు తమ పేర్లను అధిష్టానానికి పంపినట్లు సమాచారం. తీవ్ర పోటీ నెలకొన్న నేపథ్యంలో ఏం జరుగుతుందో.. ఎవరికి విండో పదవి దక్కుతుందో మండలంలో ఆసక్తికరంగా మారింది.